క్లుప్తంగా

క్రీడాకారిణులకు ఆర్థిక సాయం



క్రీడాకారిణులకు ఆర్థిక సాయం అందిస్తున్న దృశ్యం

ఏలూరు రూరల్ : ఇటీవల రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ పోటీల్లో ప్రతిభ చాటిన ఏలూరు కస్తూరి బా బాలికల పాఠశాల క్రీడాకారిణులు ఏడుగిరికి రిటైర్డ్ హెచ్ఎం జల్లా వీరభద్రరావు సోమవారం ఆర్థిక సాయం అందజేశారు. క్రీడల్లో రాణించిన వారు శారీరకంగా, మానసికంగా బలంగా రూపుదిద్దుకుంటారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం జి.సునీత మాట్లాడుతూ బాలికలు చదువుతో పాటు క్రీడల్లో సైతం రాణించాలన్నారు. దాతలు, తల్లి దండ్రులు, శిక్షకుల సహకారంతో ఉన్నత శిఖరాలకు చేరాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు కె.మురళీకృష్ణ, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

నోటు పుస్తకాల పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే చంటి

ఏలూరు రూరల్ : తనను కలిచేవారంతా బొకేలకు బదులుగా విద్యార్థులకు అవసరమైన నోట్ పుస్తకాలు తీసుకురావాలని ఎమ్మెల్యే బడేటి చంటి కోరారు. తనకు అభిమానులు ఇచ్చిన నోటు పుస్తకాలను సోమవారం 13 డివిజన్ వైఎస్సార్ కాలనీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆయన పంపిణీ చేశారు. పాఠశాల ప్లే గ్రౌండ్ మెరక చేయించాలని ప్రధానోపాధ్యాయురాలు పి.జయలక్ష్మి, జేజే స్టీవెన్ తదితరులు కోరగా మెరక పనులు చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో చోడే వెంకటరత్నం, మెరుగుమాల శ్రీనివాసరావు, ఊడి రాజశేఖర్, దావూద్ షరీఫ్, ఏసు తదితరులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్య అందించాలి

పెదపాడు: విలువలతో కూడిన విద్యను అందించాలని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఉపాధ్యాయులను ఆదేశించారు. పెదపాడు మండలం అప్పనవీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు.

అందుబాటులో పాఠ్య, నోటు పుస్తకాలు

- ఏలూరు నియోజకవర్గంలో 122 ప్రభుత్వ పాఠశాలలు
- 14,908 మంది విద్యార్థులు
- 1,55,794 పుస్తకాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : విద్యా సంవత్సరం ప్రారంభమైన నాటి నుంచే విద్యార్థుల చేతిలో పాఠ్య, నోట్ పుస్తకాలు ఉంటే వారి విద్యాభ్యాసం నిరాటంకంగా వార్షిక క్యాలెండర్ ప్రకారం ఎటువంటి ఆటంకాలు లేకుండా సాగుతుందని భావించి విద్యాశాఖాధికారులు విద్యార్థులకు అవసరమైన పుస్తకాలను ముందుగానే రప్పించారు. ఈ మేరకు గత విద్యా సంవత్సరంలోనే ఈ విద్యా సంవత్సరానికి అవసరమైన పుస్తకాలు, ఇతర విద్యా సామగ్రి కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు చేశారు. ఏలూరు నియోజకవర్గ విద్యార్థుల అవసరానికి మించి పుస్తకాలను రప్పించడంలో అధికారులు సఫలీకృతులయ్యారు. ఆయా పుస్తకాలు విద్యార్థుల చేతికి అందించడానికి ప్రణాళికాబద్ధంగా అడుగులు వేశారు. కాగా గతంలో పాఠశాలలు ప్రారంభమై నెలలు గడుస్తున్నా విద్యార్థుల చేతికి పుస్తకాలు అందేవి కావు. కానీ గత ఐదేళ్ల కాలంలో అటువంటి ఇబ్బంది రాకుండా విద్యార్థులకు బడి తెరిచిన రోజు నుంచే పుస్తకాలను పంపిణీ చేయడం ఆనవాయితీ చేశారు. ఈ మేరకు ఈ ఏడాది కూడా అదే ఆనవాయితీని కొనసాగించారు.



పాఠశాలలో పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈఓ రంగయ్య

122 పాఠశాలలు : 14,908 మంది విద్యార్థులు

ఏలూరు నియోజకవర్గంలో మొత్తం 122 జిల్లా, మండల పరిషత్, ప్రభుత్వ, నగరపాలక సంస్థ యాజమాన్యాల్లోని పాఠశాలలు ఉండగా, మొత్తం 14908 మంది విద్యార్థులు 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్నారు. వీటిలో ఏలూరు అర్బన్ పరిధిలో 65 పాఠశాలలున్నాయి. వీటిలో మొత్తం 8,295 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఏలూరు రూరల్ పరిధిలో మొత్తం 57 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా మొత్తం 6,613 మంది విద్యాభ్యాసం చేస్తున్నారు.

1,55,794 పుస్తకాలు

ఏలూరు నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు 1,55,794 పుస్తకాలను అధికారులు తెప్పించారు. వాటిలో 1 నుంచి 5వ తరగతి వరకు విద్యార్థులకు 32,308 పుస్తకాలు, 6 నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులకు 1,23,486 పుస్తకాలు ఉన్నాయి. ప్రాథమిక స్థాయి విద్యార్థులకు తెలుగు రీడర్, ఇంగ్లిష్ రీడర్, గణితం బైలింగువల్, ఈవీఎస్ బైలింగువల్, ఆయా సబ్జెక్టుల వర్క్‌బుక్స్ రాగా, గణితం వర్క్‌బుక్స్, ఉర్దూ రీడర్ వంటి పుస్తకాలు రావాల్సుంది. ప్రాథమికోన్నత, ఉన్నత స్థాయి విద్యార్థులకు జనరల్ సైన్స్ బైలింగువల్ మినహా మిగిలిన తెలుగు రీడర్, ఇంగ్లిష్ రీడర్, నాన్ డిటైల్, హిందీ రీడర్, గణితం బైలింగువల్, సోషల్ స్టడీస్ బైలింగువల్, ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్, సోషల్ జాగ్రఫీ సోషల్ హిస్టరీ, సోషల్ పొలిటికల్, ఎకనామిక్స్ వంటి పుస్తకాలు వచ్చాయి.

ప్రతి విద్యార్థికీ పుస్తకాలు అందిస్తాం



గ్రామీణ, నగర ప్రాంతాల్లోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు అందరికీ పాఠ్యపుస్తకాలు అందించేందుకు ఏర్పాట్లు చేశాం. ఇప్పటికే ఎమ్మెల్యే బడేటి చంటి, జిల్లా విద్యాశాఖాధికారి ఎస్ అబ్రహాం, సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ బి.సోమశేఖర్ తదితరుల చేతుల మీదుగా విద్యార్థులకు పుస్తకాలు అందజేశాం. మా వద్దకు వచ్చిన అన్ని పుస్తకాలనూ విద్యార్థులకు మరికొన్ని రోజుల్లో పూర్తిస్థాయిలో అందిస్తాం. ఇంకా కొన్ని పుస్తకాలు రావాల్సుంది.

– రూపావతు రంగయ్య, ఏలూరు మండల విద్యాశాఖాధికారి.

వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు



పెదపాడులో మాట్లాడుతున్న ఎంపీడీఓ తేజరతన్

పెదపాడు: గ్రామాల్లో సీజన్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ జె.తేజరతన్ తెలిపారు. పెదపాడు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. వర్షాకాలంలో సీజన్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వాటి నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలని, డ్రెయినేజీల్లో పూడిక తొలగించాలని అన్నారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ సూర్యకుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పీఎస్ఆర్‌వీ ఎస్ఎస్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

జాతీయ రహదారి సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు(మెట్రో): ఆరు లైన్ల జాతీయ రహదారి నిర్మాణంలో దెందులూరు నియోజకవర్గంలో గుర్తించిన సమస్యలపై జులై, 10వ తేదీలోగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జేసీ బి. లావణ్యవేణి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమీ సమావేశపు హాలులో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌తో కలిసి సోమవారం సాయంత్రం జాతీయ రహదారి, రోడ్లు, భవనాలు, రెవెన్యూ శాఖల అధికారులతో జేసీ సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ లావణ్యవేణి మాట్లాడుతూ జాతీయ రహదారి-16లో హనుమాన్ జంక్షన్ నుంచి గుండుగొలను వరకు దెందులూరు నియోజకవర్గ పరిధిలోని పెదపాడు, పెదవేగి, దెందులూరు మండలాల్లో నెలకొన్న పలు సమస్యలపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే చింతమనేని మాట్లాడుతూ జాతీయ రహదారి-16లో 6 లైన్ల రహదారి నిర్మాణంలో దెందులూరు నియోజకవర్గంలో అవసరమైన ప్రదేశాల్లో బ్రిడ్జిలు, అండర్ పాస్‌లు, సర్వీస్ రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టులు నిర్మించలేదని, వీటిపై దృష్టి సారించాలని కోరారు. సమావేశంలో ఆర్అండ్‌బీ సూపరింటెండెంట్ ఇంజనీర్ జాన్ మోషే, ఆర్డీఓ ఎన్.ఎస్.కె.ఖాజావలి, హైవే సంస్థ అధికారులు, రెవెన్యూ, ఆర్అండ్‌బీ సిబ్బంది పాల్గొన్నారు.

కొండ చిలువ హతం

టి. నరసాపురం: పుట్రేపులో 12 అడుగుల కొండచిలువ గ్రామస్తుల చేతిలో హతమయ్యింది. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రైతు ఇంటి సమీపంలో ఉన్న కోళ్ల గాబులో భారీ కొండ చిలువ ప్రవేశించి కోడి పుంజును మింగేస్తుంది. కోళ్ల అరుపులతో కుటుంబ సభ్యులు చూడగా కొండ చిలువ కనపడింది. దీంతో ప్రమాదం పొంచి ఉందని స్థానికుల సాయంతో దానిని హతమార్చారు.

ఉత్సాహంగా 'నేను బడికి పోతా'

పెదపాడు: చిన్నారులను తప్పనిసరిగా బడిలో చేర్పించాలని జిల్లా ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ రాధాకృష్ణ తల్లిదండ్రులకు సూచించారు. పెదపాడు మండలం ఏపూరు గ్రామ పంచాయతీ తిమ్మనవీడు కాలనీలో సోమవారం ఉత్సాహంగా నేను బడికి పోతా కార్యక్రమం నిర్వహించారు. 24, 25 తేదీల్లో బడి బయట ఉన్న పిల్లలంతా బడిలో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని రాధాకృష్ణ సూచించారు. కార్యక్రమంలో జిల్లా బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన అధికారులు పాల్గొన్నారు. తొలుత పాఠశాల ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు గ్రామస్తులు, విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు.

రైతుల సమస్యలపై జేసీకి వినతి

ఏలూరు (టూటౌన్) / (మెట్రో) : జిల్లాలోని రైతాంగ సమస్యలు పరిష్కరించి, రైతులను ఆదుకోవాలని కోరుతూ ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ తరుపున జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ బి.లావణ్యవేణికి ప్రజాసమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నిమ్మగడ్డ నర్సింహా, కార్యదర్శి కె.శ్రీనివాస్‌లు సోమవారం వినతి పత్రం అందజేశారు. జిల్లాలో రబీ ధాన్యం అమ్మిన రైతులకు రూ.240 కోట్లు బకాయి విడుదల చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పెట్టుబడి సాయం రూ.20వేలు వెంటనే అందించేలా చర్యలు చేపట్టాలని, వ్యవసాయ పంపు సెట్లకు మీటర్లు బిగింపునకు జారీ చేసిన జీఓ-22ను రద్దు చేయాలని కోరారు. పాడి రైతులకు లీటరుకు రూ.5 బోనస్ ఇవ్వాలని పేర్కొన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దుకు అసెంబ్లీలో చట్టం చేయాలని, సమగ్ర భూ సర్వేలో జరిగిన లోపాలను సరిచేసి ఖచ్చితమైన పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వాలని కోరారు. సమగ్ర పంటల బీమా పథకం తీసుకురావాలని, పంటల బీమా ప్రీమియం రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని పేర్కొన్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తి చేసి జిల్లాలోని రెండు లక్షల ఎకరాలకు సాగు నీరు అందించేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ పథకంలో భూములు కోల్పోతున్న భూ నిర్వాసిత రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. భూ యజమాని సంతకంతో నిమిత్తం లేకుండా కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులిచ్చి, వడ్డీ లేని పంట రుణాలు, నష్టపరిహారాలు ఇవ్వాలని కోరారు. గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతుల సమస్యలు పరిష్కరించాలని, హైవే నిర్మాణంలో సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. కొబ్బరి కొనుగోలు కేంద్రాలు తెరవాలని, సీడ్ మొక్కజొన్న సాగు చేస్తున్న రైతులకు విత్తన కంపెనీల నుంచి అగ్రిమెంట్స్ ఇప్పించాలని కోరారు. ఉద్యాన పంటల రైతులకు ఇవ్వాల్సిన సబ్సిడీ బకాయిలు అందించాలని, నూజివీడులో ఉద్యాన శాఖ కార్యాలయం ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఆక్వా రైతులకు విద్యుత్ యూనిట్ రూ.1.50 ఇవ్వాలని, గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. ఆయిల్‌పామ్ టన్ను గెలలకు రూ.18 వేలు ధర ప్రకటించాలన్నారు. తాడిపూడి ఎత్తిపోతల పథకం ద్వారా ద్వారకాతిరుమల, దెందులూరు మండలాలకు సాగునీరు అందించాలని, జిల్లాలోని సాగునీటి ఆయకట్టు ఉన్న చెరువుల ఆక్రమణలు తొలగించేలా చర్యలు చేపట్టాలని వారు కోరారు.



ఇన్‌చార్జి కలెక్టర్ లావణ్యవేణికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	29
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	38
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.30	44
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	16.00	--
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	33

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.45	4820	25
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21,.15	4822	29
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	32
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	27
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	30
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	31
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	32
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	23
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.20	98511	00
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.10	98503	00
ఏలూరు - తిరుపతి	16.00	4830	34

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	68	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	28	చిక్కుడు కాయలు	96
వంకాయలు (కాంతులు)	44	చామదుంపలు	44
వంకాయలు (తెలుపు)	44	ములక్కాడలు	05, 07
బెండకాయలు	44	కంద	64
పచ్చిమిర్చి	44	బీట్‌రూట్	36
కాకర కాయలు	56	కీరా దోస	40
బీరకాయలు	36	ఫ్రెంచ్‌బీన్స్	--
బీరకాయలు (పందిరి)	56	అల్లం	180
క్యాబేజీ	40	కొత్తిమీర (కట్ట)	30
క్యారెట్	36-50	పాలకూర	12
దొండకాయలు	24	చుక్కకూర	12
బంగాళదుంపలు	36	తోటకూర	10
ఉల్లిపాయలు	38	గోంగూర	07
గోరుచిక్కుడు	--	పుదీనా	05
దోసకాయలు	24	బఠాణీ	--
ఆనబకాయ (1)	10-15	క్యాప్సికమ్	100
పొట్లకాయ(1)	15	చిలకడదుంప	48

ఏజెన్సీలో భారీ వర్షం



జీలుగుమిల్లి-కామయ్యపాలెం రహదారిపై ప్రవహిస్తున్న వాగు

బుట్టాయగూడెం : ఏజెన్సీ ప్రాంతంలోని మండలాల్లో సోమవారం తెల్లవారు జామున భారీ వర్షం కురిసింది. సుమారు 2 గంటల పాటు ఏకధాటిగా వర్షం కురవడంతో కొండవాగులు పొంగిపొర్లాయి. గుబ్బల మంగమ్మ గుడి రహదారి వెంబడి కాల్వలు, కేఆర్‌పురం వాగు, చింతకొండ వాగు, జోలుగండి వాగులు పొంగిపొర్లాయి. జీలుగుమిల్లి నుంచి కామయ్యపాలెం వెళ్లే రహదారిపై వాగు పొంగి పొర్లడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. గంట తర్వాత వాగులో ఉధృతి తగ్గి వాహనాల రాకపోకలు ప్రారంభమయ్యాయి.

ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డు పరిశీలన

ఉంగుటూరు: ఉంగుటూరు మండలంలోని చేబ్రోలు గ్రామ పంచాయతీలో (ఎస్‌డబ్ల్యూపీసీ) చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం షెడ్డును డిస్ట్రిక్ కో-ఆర్డినేటర్ జి.ప్రసంగి రాజు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రందే లక్ష్మీ సునీత, కార్యదర్శి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆదర్శ గ్రామంగా తయారు చేయడానికి సహకారం అందించాలని ప్రసంగిరాజును కోరారు. ఈ నేపథ్యంలో వారు చేపడుతున్న పారిశుద్ధ్య పనులను వివరించారు. ప్రతిరోజు ప్రజల నుంచి సేకరించిన తడి, పొడి చెత్తను వేరు చేసి వర్మీకంపోస్టు తయారు చేస్తున్నామన్నారు. లోకల్ ట్రెనింగ్ సెంటర్‌గా ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డు ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా షెడ్డును, గ్రామాన్ని ప్రసంగిరాజు పరిశీలించారు. గ్రామంలో అమలు చేస్తున్న పారిశుద్ధ్య పనులు, ఎస్‌డబ్ల్యూపీసీ నిర్వహణపై అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డీపీఆర్‌సీ ఎస్.భూషణం, పంచాయతీ సిబ్బంది, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఎఫ్ ఉద్యోగుల ఆందోళన

గణపవరం: గణపవరం సీపీఎఫ్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న పర్మినెంట్ ఉద్యోగులు తమ ఆందోళనను కొనసాగిస్తున్నారు. నియామక సమయంలో కంపెనీ యాజమాన్యం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ సోమవారం సీపీఎఫ్ ఉద్యోగులు రాజమండ్రిలోని కంపెనీ గేటు 18వ రోజు ఆందోళన కొనసాగించారు. కంపెనీ యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమ డిమాండ్లు నెరవేర్చాలని, కంపెనీని తిరిగి ప్రారంభించాలని వారు నినాదాలు చేశారు. న్యాయం జరిగేవరకూ ఆందోళన కొనసాగిస్తామని వారు ప్రకటించారు.

అధమరాజు గద్దెను సందర్శించిన ఐటీడీఏ పీఓ

బుట్టాయగూడెం: గిరిజన సంస్కృతి సాంప్రదాయాల పరిరక్షణకు ప్రత్యేక కృషి చేస్తామని ఐటీడీఏ పీఓ ఎం.సూర్యతేజ తెలిపారు. మండలంలోని మారుమూల గ్రామమైన మెరకగూడెంలో సోదెం వారి ఇలవేల్పు అయిన చిన అధమరాజు, పెద్ద అధమరాజుల గద్దెను పీఓ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా గిరిజన సాంప్రదాయ పూజల్లో పాల్గొన్నారు. గిరిజన మహిళలతో కలిసి పీఓ సాంప్రదాయ నృత్యాలను చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గిరిజన సంస్కృతి, ఆచారాలకు ఒక ప్రాధాన్యత ఉంటుందన్నారు. అనాదిగా గిరిజనుల సాంప్రదాయంగా నిర్వహిస్తున్న ఇలవేల్పుల జాతర నిర్వహించడం అభినందనీయమన్నారు. గిరిజన పండుగలకు, ఆదివాసీల సంస్కృతి, సాంప్రదాయాల పరిరక్షణకు సహకారం అందిస్తామని తెలిపారు. అనంతరం కేఆర్‌పురం ఐటీడీఏ, గిరిజన సంక్షేమ శాఖ సాంస్కృతిక విభాగం సౌజన్యంతో నిర్మించిన సోదెం వారి ఇలవేల్పుల (పేను) గద్దె భవనాన్ని పీవో ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ సోదెం గంగాదేవి, కేఆర్‌పురం ఐటీడీఏ గిరిజన సంక్షేమ శాఖ ఈఈ కేవీఎస్ఎన్ కుమార్, డీవైఈఓ కె.నీలయ్య, ఏఎంఓ శిరమయ్య, పూజారి సోదెం సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.



అధమరాజు గద్దెను సందర్శించి, పూజ చేస్తున్న పీఓ సూర్యతేజ

జగన్‌ను కలిసిన అభిమాని పండు




మాజీ సీఎం జగన్‌ను కలిసిన గంటా పండు

దెందులూరు : అభిమానం జిల్లాలు దాటి పులివెందుల వెళ్లేలా చేసింది. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసేందుకు మండలంలో కొమిరేపల్లికి చెందిన ఆయన అభిమాని, వైఎస్సార్‌సీపీ నేత గంటా పండు సోమవారం పులివెందులలో జగన్ క్యాంపు కార్యాలయానికి వెళ్లారు. ఏలూరు జిల్లా దెందులూరు నియోజకవర్గం నుంచి వచ్చానని చెప్పగానే ఎంతో ఆప్యాయంగా పలకరించారని గంటా పండు సంతోషం వ్యక్తం చేశారు. తన అభిమాన నాయకుడ్ని కలవడం చాలా సంతోషంగా ఉందని, ఇలాంటి సంఘటనను మరువలేనని పండు అన్నారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి

జంగారెడ్డిగూడెం: హెల్మెట్ ధారణ సురక్షిత ప్రయాణానికి సంకేతమని సీఐ పి.రాజేష్ అన్నారు. జంగారెడ్డిగూడెంలో సోమవారం హెల్మెట్ ధారణపై వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలో వాహన తనిఖీలు నిర్వహించి హెల్మెట్ ధరించని వాహనదారులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. సీఐ మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ప్రతీ వాహనదారుడి కర్తవ్యమన్నారు. నిబంధనలు పాటిస్తే ప్రమాదాల నివారణకు అవకాశం ఉంటుందన్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లు నడిపే వారు సీటు బెల్టు ధరించడం తప్పనిసరని తెలిపారు. వాహన ప్రమాదాల్లో ఎక్కువ శాతం తలకు గాయాలు తగలడం వలన మృతి చెందుతున్నారన్నారు. ప్రమాద తీవ్రత తగ్గించేందుకు హెల్మెట్‌లు, సీటు బెల్టులు ఎంతో దోహదం చేస్తాయన్నారు. ఇటీవల కాలంలో వాహనదారులు సెల్‌ఫోన్ డ్రైవింగ్ ఎక్కువ చేస్తున్నారని, ఇది చాలా ప్రమాదమన్నారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేస్తూ పట్టుబడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే మైనర్‌లకు వాహనాలు ఇవ్వొద్దని తల్లితండ్రులు ఈ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. లేకపోతే భారీ జరిమానాలు, అవసరమైతే జైలు శిక్షను కూడా ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ట్రాఫిక్ ఎస్సై జె.రంగయ్య, సిబ్బంది పాల్గొన్నారు.



హెల్మెట్ ధారణపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఉపాధి హామీలో అవకతవకలపై ఫిర్యాదు

భీమడోలు : ఉపాధి హామీ పథకంలో జరిగిన అవకతవకలపై విచారణ చేయాలని మండల స్థాయి అధికారులకు సోమవారం గ్రామస్తులు వినతిపత్రం అందించారు. భీమడోలు తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు. భీమడోలులో ఉపాధి హామీ పథకంలో భారీగా అవకతవకలు జరిగాయని, పని చేయని వారికి తప్పుడు మస్టర్లు వేసారని తహసీల్దార్ జి.వరహాలయ్య, ఎంపీడీవో స్వర్ణలతకు ఫిర్యాదు చేశారు. వివిధ గ్రామాల నుంచి ప్రజలు వివిధ సమస్యలపై ఫిర్యాదు చేశారు. డ్రెయినేజీ, వీధిలైట్లు తదితర అంశాలపై ఫిర్యాదు చేశారు. గ్రామస్తులు ఈతకోట దుర్గబాబు, బాబి, శేషపు గిరి, ఎం.సుబ్రహ్మణ్యం, దుంగా రమణ, గొట్టాపు సతీష్, కె.నాని, రామకృష్ణ పాల్గొన్నారు.



భీమడోలులో ఉపాధి హామీ పథకపు పనులపై విచారణ చేయాలని ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

నీట్ పరీక్ష అవకతవకలపై విచారణకు డిమాండ్

దెందులూరు: ఇటీవల నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలపై విచారణ చేయించాలని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శులు కట్టా ఏసుబాబు, చల్లా మేరిరాజు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం దెందులూరులో వారు మాట్లాడుతూ నీట్ పరీక్షలో జరిగిన అవకతవల వల్ల మధ్యతరగతి, బడుగు బలహీన వర్గాల విద్యార్థులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రతిభకు ఏ రంగంలోనూ ఏ ప్రాంతంలోనూ అన్యాయం జరగకూడదని, కేంద్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని విచారణ చేయించాలని కోరారు.